

గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని కళాకారులు గుర్తింపు కార్డుల కోసం ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి టి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అర్హులైన కళాకారులకు కొత్త గుర్తింపు కార్డులు పొందేందుకు కమిషనర్ సూచనలు పాటించాలని పేర్కొన్నారు. జెండర్, బ్లడ్ గ్రూపు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, చిరునామా, జిల్లా కళారూపం అనుభవం, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ ఇ-మెయిల్ అడ్రస్ మొదలైన వివరాలను సంబంధిత ఆధారాల నకలు ప్రతులను జతచేసి తమ దరఖాస్తులను 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి పంపాలని ఆయన తెలిపారు. అదనపు వివరాల కోసం 73820 17485 నంబరును సంప్రదించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి టి.నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

ఒక్క హామీ.. అమలైతే ఒట్టు..!

ఎన్నికల్లో గెలుపొందడానికి పలు హామీలు గుప్పించడం, ఆ తర్వాత మరిచిపోవడం రాజకీయ పార్టీలకు సర్వసాధారణమైంది. 2019 ఎన్నికల్లో జిల్లా ప్రజలకు అత్యంత అవసరైన పలుహామీలను వైసిపి గుప్పించింది. అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లు పూర్తయినప్పటికీ ఏ ఒక్క హామీ కూడా అమలుచేయలేదు. దీంతో మరోసారి మోసపోయామంటూ జిల్లా ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు మరో ఆరు నెలల్లో ఎన్నికలు రానుండటంతో జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం దృష్టిసారిస్తుందా అన్న చర్చ సైతం నడుస్తోంది.



2019 ఎన్నికల్లో జిల్లాలో వైసిపి వరాల జల్లు

ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ అమలుకాని పరిస్థితి

అటకెక్కిన పోలవరం నిర్వాసితుల పరిహారం, వాటర్ గ్రిడ్

చింతలపూడి ఎత్తిపోతల రైతులకూ అన్యాయమే

ప్రకటనలతో సరిపెడుతున్న కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం

తెరచుకోని చాగల్లు సుగర్ ఫ్యాక్టరీ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

'మాటతప్పం.. మడమతిప్పం' అంటూ వైసిపి నాయకులు పదేపదే చెబుతున్న మాట. గడిచిన ఎన్నికల్లో జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకూ ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. 2019 ఎన్నికల్లో జిల్లాలో జరిగిన ప్రధానపాత్ర పోషించిన హామీల్లో ప్రధానమైనది వాటర్‌గ్రిడ్ నిర్మాణం. డెల్టాలోని దాదాపు 25 మండలాల్లో ఈ హామీ తీవ్ర ప్రభావం చూపిందని చెప్పొచ్చు. ఆక్వా చెరువులు పెరిగిపోవడంతో డెల్టాలోని తాగునీటి వనరులన్నీ కలుషితమయ్యాయి. అక్కడి జనం తాగేందుకు గుక్కెడు తాగునీరు లేకుండా పోయింది. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరడం లేదు. దీంతో వైసిపి అధినేత జగన్ తన పాదయాత్రలోగానీ, ఎన్నికల ప్రచారంలోగానీ తాగునీటి సమస్యపైనే ఎక్కువగా మాట్లాడేవారు. వైసిపి అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేస్తామని, గోదావరి నుంచి నేరుగా పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత రూ.3,200 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి సైతం చేశారు. తర్వాత డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చావుకబురు చల్లగా చెప్పారు. అయినప్పటికీ కానీ నేటికీ వాటర్‌గ్రిడ్‌కు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో ఇప్పటికీ జనం తాగునీరు కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో జిల్లా ప్రజలకు ఇచ్చిన తాగునీటి వంటి ప్రధాన హామీని కూడా ప్రభుత్వం నెరవ్చేలేకపోయింది. రాష్ట్రానికి జీవనాడి అని చెబుతున్న పోలవరం ప్రాజెక్టు కోసం సర్వంత్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం పెంచుతామని హామీ ఇచ్చింది. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలు పెంపుచేసి అందిస్తామని చెప్పింది. 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రధానంగా ఇచ్చిన ఈ రెండు హామీలను కూడా వైసిపి ఇప్పటికీ అమలు చేయలేదు. ఇచ్చిన హామీల అమలు చేయకపోగా పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందించలేదు. దీంతో ప్రతిఏటా వరదలకు పోలవరం నిర్వాసితులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు బతుకులు నెట్టుకొస్తున్నారు. అధికారంలోకొచ్చిన రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామన్న హామీ సైతం అలానే ఉండిపోయింది. కొల్లేరులోకి సముద్రంలోని ఉప్పునీరు చేరకుండా ఉప్పుటేరుపై రెగ్యులేటర్లు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలంలోని పడితడక వద్ద వీటిని నిర్మిస్తామని ప్రకటించారు. అందుకోసం రూ.400 కోట్లకు పైగా నిధులను సైతం మంజూరు చేసినట్లు చెప్పినప్పటికీ పనులు మాత్రం ఒక్క అడుగు ముందుకు పడలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలంటూ టిడిపి ప్రభుత్వంలో పెద్దఎత్తున నిరసనలు, రిలే దీక్షలు చేశారు. 2019 ఎన్నికల్లో చింతలపూడి బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకొచ్చాక రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మూతపడిన చాగల్లు సుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ సుగర్ ఫ్యాక్టరీ తెరచుకోలేదు. కార్మికులకు ఎలాంటి న్యాయమూ జరగలేదు. గత ఎన్నికల్లో రోడ్ల నిర్మాణంపైన వైసిపి పలు హామీలిచ్చింది. ఇప్పటికీ రోడ్ల వ్యవస్థ బాగుపడలేదు. ఇవికాకుండా ఆయిల్‌పామ్, పొగాకు రైతులకు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు సైతం సక్రమంగా అమలు చేయలేదు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను పక్కకు పెట్టడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్న కొద్దిరోజుల పాలనలోనైనా ఇచ్చిన హామీలను నెరువేరుస్తుందో వేచిచూడాల్సి ఉంది.



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదునూరి

యువతకు గాంధీ స్ఫూర్తి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



భీమవరం : గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

బాపూజీ జీవితం ఎంతోమందికి స్ఫూర్తి అని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, పురపాలక శాఖ సిబ్బందితో కలిసి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బస్ స్టాండ్ ఆవరణ నుంచి మెయిన్ రోడ్డు గాంధీ బొమ్మ సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ గాంధీ విగ్రహానికి ముదునూరి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కాటన్ పార్కుకు చేరుకుని ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించి భావితరాల వారికి స్ఫూర్తిగా నిలుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కోపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు షేక్ బుల్ మస్తాన్, కౌన్సిలర్లు కేసరి గంగరాజు, కాంతమ్మ పాల్గొన్నారు.

భీమవరం: గాంధీజీ మార్గం అనుసరణీయమని, నేటి యువత వారి స్ఫూర్తితో ముందడుగు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్లో గాంధీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ, అంబేద్కర్, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు జెసి రామ్‌సుందర్ రెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, కలెక్టరేట్ ఎఒ వైకెవి.అప్పారావు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గాంధీజీ ఆలోచనలు, భావనలు, సిద్ధాంతాలు ఎందరికో స్ఫూర్తిగా నిలిచాయన్నారు. నేటి యువత వారి బాటలో అడుగులు వేస్తూ దేశ ప్రగతికి తోడ్పాటు నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార శాఖ అధికారి టి.నాగేశ్వరరావు, డిఎంహెచ్ఒ మహేశ్వరరావు, జిల్లా ఆర్అండ్‌బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తణుకు : గాంధీ జయంతి వేడుకలు సోమవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో ఉన్న గాంధీజీ విగ్రహానికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహమూర్తి



భీమవరం : గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నినాదాలు చేస్తున్న గీత కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించి సంక్షోభంలో ఉన్న కార్మికులను ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సంఘం ఆధ్వర్యంలో భీమవరంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నర్సింహమూర్తి మాట్లాడారు. గీత వృత్తి ప్రమాదమని తెలిసినా, ప్రభుత్వం ఆదుకోకపోయినా లక్షల మంది కార్మికులు ఇదే వృత్తిని చేస్తున్నారని చెప్పారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన వాగ్దానాలు ఒక్కటీ అమలు చేయక పోవడం వల్ల గీత కార్మికులు అభద్రతా భావనలో ఉన్నారన్నారు. అక్రమ మద్యం, కల్తీ మద్యం, చీప్ లిక్కర్ అరికట్టకపోవడం, మొబైల్ మద్యం వ్యాపారం ప్రోత్సహించడం వల్ల కల్లు అమ్మకాలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో గీత కార్మికులు బతకలేని పరిస్థితికి వచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో 110 మంది గీత కార్మికులు తాటిచెట్లపై నుంచి పడి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత వికలాంగులైన వారికీ ఎక్స్‌గ్రేషియో రాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విమర్శచారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ద్వారా అందించాలన్నారు. ఈ వృత్తి చేస్తూ ప్రమాదంలో చనిపోయిన వారి దహన సంస్కార ఖర్చులకు రూ.25 వేలు, గాయాలపాలైన వారికి వైద్యం నిమిత్తం రూ.15 వేలు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాటి చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్న వారిపై చట్ట ప్రకారం కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాగిత రాధాకృష్ణ, చింతపల్లి చిన వీరస్వామి, కడలి పాండు, దొంగ సాయిబాబు, తంగెళ్ల నరసింహస్వామి, వీరవల్లి శ్రీనివాసు, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : గీత వృత్తిని కాపాడు మహాత్మా అంటూ గీత కార్మికులు గాంధీ జయంతిని పురస్కరించుకుని కల్లుగీత కార్మక సంఘం ఆధ్వర్యంలో సోమవారం గాంధీ విగ్రహం వద్ద ఆయన విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 వేల మంది కార్మికులు గీత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా, ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుండా రోడ్డున పడేశారని తెలిపారు. కల్లు అమ్మకాలను తగ్గించి బ్రాందీ అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా కార్పొరేషన్ ఎటువంటి ఉపకారము లేకుండా పక్కన పెట్టేశారని అన్నారు. ప్రభుత్వం గీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా సభ్యులు గుబ్బల వీర రాఘవులు, సంఘం నాయకులు కాసాని శ్రీనివాస్, కట్టా వెంకటేశ్వరరావు, బొర్రా సత్యనారాయణ, చిట్టూరి ఆదినారాయణ పాల్గొన్నారు.



తణుకులో..



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష పార్ట్‌టైం ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

సమగ్ర శిక్ష పార్ట్‌టైం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్ అన్నారు. పార్ట్ టైం ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ భీమవరంలో మహాత్మా గాంధీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావట్లేదం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖల్లో ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని, మినిమం టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచారని, అయితే ఆరేళ్ల నుంచి సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచలేదని, నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు. ఎంటిఎస్ కోసం ఇచ్చిన జిఒలు అమలు చేయలేదని చెప్పారు. రవాణా ఛార్జీలు, పనిభారంతో ఉద్యోగులు సతమతమవుతున్నారన్నారు. నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా రావడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోని మార్చి మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పివి.నాగబ్రహ్మం, దుర్గాప్రసాద్, ఎ.నీలిమ, కె.అంబిక పాల్గొన్నారు.

20వ రోజుకు టిడిపి దీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు సోమవారం మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని ప్రారంభించిన మెంటే పార్థసారథి మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా చంద్రబాబు జైల్లో నిరాహార దీక్ష, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి జైలు బయట చేస్తున్న నిరాహార దీక్షలకు సంఘీభావంగా సత్యమేవ జయతే దీక్షలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రేవు వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి వీరవల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలో టిడిపి నాయకులు సోమవారం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయా విగ్రహాల వద్ద చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, పెంటయ్య, మూలస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఉండిలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఎంఎల్ఎ, నేతలు

ఆచంట : ఇది కార్యకర్తల ఉద్యమం కాదని, ప్రజా ఉద్యమం రాబోతుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసనగా ఆచంట కచేరీ సెంటర్లో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 20వ రోజు చేరుకున్నాయి. ఈ దీక్షలకు పితాని సంఘీభావం తెలిపి మాట్లాడారు. చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పల్ పార్టీ సురేష్ బాబు, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు పాల్గొన్నారు.

తణుకు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక రిలే నిరాహార దీక్షలు 20వ రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణతోపాటు క్షత్రియ సోదరులు దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలను పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమ్మేటి వెంకట సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం రాత్రి పాలకొల్లులోని ఆయన స్వగృహంలో కొవ్వొతులతో నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ మ్మెల్సీ అంగర రామ్మోహన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై పెట్టిన చీకటి కేసులు నిలబడవని చెప్పారు. అలాగే శెట్టిబలిజ కులస్తుల ఆధ్వర్యంలో బాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ, పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఉన్న శిబిరం వద్ద శెట్టి బలిజ సభ్యులు దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, మామిడి శెట్టి పెద్దిరాజు, జివి, పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు.

ఉండి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను సత్యమేవ జయతే దీక్ష పేరిట ఉండిలో కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు మాట్లాడారు. అనంతరం కళ్లకు గంతలు కట్టి నీతులు చెప్పే మూడు కోతుల తరహాలో వినూత్న రీతిలో దీక్షను కొనసాగించారు. సాయంత్రం నియోజకవర్గ పరిశీలకులు కొత్త నాగేంద్రబాబు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం కొవ్వొత్తులతో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, కాళ్ల మండల అధ్యక్షులు జి.నాగేశ్వరరావు, పాలకోడేరు మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు పాల్గొన్నారు.



పాలకొల్లులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంగర, కుటుంబ సభ్యులు

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా దళితులపై వివక్ష కొనసాగుతూనే ఉందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ తెలిపారు. కెవిపిఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం ఆత్మగౌరవ సమానత్వం, కుల నిర్మూలన, జెండాను పొలమూరు, జుత్తిగ గ్రామాల్లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి తరతరాల నుంచి శ్రమను ధారపోస్తున్న దళితులు అంటరానితనం, కులవివక్ష, అత్యాచారాలు, అణిచివేతలు, సాంఘిక బహిష్కరణలకు గురవుతూనే ఉన్నారని తెలిపారు. మనువాద, మతోన్మాదులు చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించేందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాపాక ఆశీర్వాదం రాజారావు, చిన్న, ఇంజె ఇశ్రాయేలు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

గాంధీ విగ్రహం వద్ద భీమలాపురం సర్పంచి నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచి గుబ్బల మాధవరావు

ప్రజాశక్తి - ఆచంట

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంలో గ్రామ పంచాయతీలకు నిధుల్లేక సర్పంచులు గ్రామాల్లో ఎటువంటి పనులు చేయలేక కేవలం ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోతున్నారని భీమలాపురం గ్రామ సర్పంచి గుబ్బల మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సుమారు గంటసేపు కింద కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పల్లెటూళ్లే పట్టు కొమ్మలని తెలిపారు. అటువంటి గ్రామ పంచాయతీల్లో నేడు వైసిపి ప్రభుత్వంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, టిడిపి సర్పంచిగా ఎటువంటి పనులు చేయలేక కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంచాయతీలకు నిధులు విడుదల చేసేలా గాంధీజీ జయంతి సందర్భంగా కోరుతున్నామని తెలిపారు.

మహాత్మా మన్నించు..

గాంధీ జయంతి రోజు మాంసం, మందు విక్రయాలు

ప్రజాశక్తి - కాళ్ల

అహింసను ఆయుధంగా చేసుకుని స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ జయంతి రోజున ప్రభుత్వం మద్యం, మాంసం విక్రయాలు నిషేధించింది. అయితే గాంధీ జయంతి రోజు మద్యం, మాంస విక్రయాలు మండలంలో పలు గ్రామాల్లో యథేచ్ఛగా సోమవారం సాగాయి. ఏలూరుపాడు, కోపల్లె, బొండాడ గ్రామాల్లో చికెన్, మటన్ విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెస్టారెంట్లకు ఆర్డర్లు ఉన్న దృష్ట్యా చికెన్, మటన్ విక్రయాలు చేస్తున్నామని వ్యాపారులు బహిరంగంగా చెబుతున్నారు. నియంత్రించాల్సిన పంచాయతీ అధికారులు పత్తాలేకుండా పోయారు. అలాగే కోపల్లె, కాళ్ల, జువ్వలపాలెం, సీసలి గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు సాగాయి. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు మౌనంగా ఉండటంతో ఈ తతంగం జరిగింది.



బొండాడలో చికెన్ విక్రయిస్తున్న వ్యాపారి

వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పాలకొల్లు రాహుల్ వృద్ధుల ఆశ్రమం, విశ్వ మానవ వేదిక, ఇతర పేద వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు వంగా నరసింహరావు, గౌరవ అధ్యక్షులు తిరుపతి రాజు, సెక్రటరీ ముత్యాల రామారావు, కార్యవర్గ సభ్యులు బాలకొండలరావు, కొల్లి నరసింహమూర్తి, నరసింహరాజు, కొండ్రెడ్డి సూరిబాబు, కారుమూరి నరసింహం, జిఎస్ఎన్.మూర్తి, యర్రంశెట్టి వెంకటరత్నం, జక్కంపూడి నరసింహరావు, రామకృష్ణంరాజు, ఎం.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఉండి

అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఏర్పడిన కుల వివక్ష పోరాట సమితి 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని పాందువ్వలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసి గోపీ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ల పూర్తయినా ఇప్పటివరకు దళితవాడలలో అభివృద్ధి శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ సభ్యులు ఎం.ప్రశాంత్, ఎస్.బాలాజీ, ఎం.వినయ్, జి.సురేష్, చిట్టిబాబు, జాన్ స్వరూప్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మద్దాల రత్నకుమారి అధ్యక్షతన వహించిన సభలో ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడారు. సిఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం అమలు చేస్తున్నారని చెప్పారు. వైసిపి హయాంలో ప్రజలకు కావాల్సిన అన్ని సంక్షేమ పతకాలు అమలు చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్ర నిలిచిందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామంలో 104 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, తహశీల్దార్ పమ్మిలక్ష్మి, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, వైసిపి నాయకులు కాకర్ల శ్రీనివాస్, దండు రాము పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల హక్కులు కాలరాస్తున్నాయని పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఎపియుడబ్ల్యూజె రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాలకొల్లు ప్రెస్‌క్లబ్ సమావేశం విన్నకోట వెంకట రమణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అనంతరం అక్రెడిటేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎంఎస్‌వి.సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పిటి వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, కాగిత సూర్యనారాయణ, సంకు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గాంధీరాజుకు గోపీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు పుట్టినరోజు సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి నేతలు చందక సత్తిబాబు, మైఖేల్‌రాజులతో ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

విభిన్న ప్రతిభావంతులు పది మందికి మూడు చక్రాల వాహనాలను శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ అందించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మూడు చక్రాల వాహనాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, యలమంచిలి ఎంపిపి రావూరి వెంకటరమణ బుజ్జి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, మైకేల్ రాజు, జోగి వెంకటేశ్వరరావు, క్రరాజయ సరిత పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ఆచంట : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు జనసేన పార్టీ ముందుంటుందని ఆ పార్టీ ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్‌రావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పెనుమంచిలిలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన వికలాంగుడు నాగరాజుకు జనసేన ఆధ్వర్యంలో మూడు చక్రాల వాహనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు ఆకుమర్తి వెంకటలక్ష్మి, దాసిరెడ్డి పుణ్యవతి, నేతలు నంబూరు విజయ్, మంగిన రాము, తోట ఆదినారాయణ, పెద్దిరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

గాంధీ బొమ్మ సెంటర్ వద్ద వైసిపి నేతలు రోడ్డు పైన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నేతలు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు సారధ్యంలో ర్యాలీగా టిడిపి దీక్షల శిబిరానికి నినాదాలు చేస్తూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద తారసపడటంతో నినాదాలు చేసుకున్నారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడగా పోలీసులు ఇరువురును చెదరగొట్టారు.

పెనుమంచిలిలో 'మహిళా శక్తి'

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెనుమంచిలి గ్రామంలో టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారంటీ, మహిళాశక్తి కార్యక్రమాన్ని టిడిపి నేతలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని తనయుడు పితాని వెంకట్ ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ చంద్రబాబునాయుడుతోనే సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేత మీరయ్య, తాళం శ్రీనివాస్, ఏడిద శ్రీనివాస్, హరి, బాలాజీ, ఆకుమర్తి మోహన్, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, నాగార్జున పాల్గొన్నారు.

జనసేన మండల యూత్ అధ్యక్షులుగా చరణ్

ప్రజాశక్తి - కాళ్ల

జనసేన పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు అన్నారు. మండల యూత్ అధ్యక్షులుగా ఎన్నికైన మేకా కాళీ చరణ్‌కి మండల కమిటీ సభ్యులు, జనసేన కాళ్ల మండల నాయకులు సోమవారం సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జనసేన నాయకులు మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికల్లో జనసేన జెండా ఎగుర వేయటానికి కృషి చేయాలని కోరారు. కాళీచరణ్ మాట్లాడుతూ కాళ్ల మండల యూత్ అధ్యక్షులుగా తనను నియమించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన పదవిని న్యాయం చేసి జనసేన పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గడి రాము, ఓగిరాల రాజేష్, ప్రధాన కార్యదర్శులు ఇర్రింకి జగన్, నిమ్మల గోపాలకృష్ణ, ఆరేటి దిలీప్, కార్యదర్శులు దేశంశెట్టి మధు, మోటూరి కృష్ణ, కొప్పర్తి ఆదిత్య, అంబళ్ల వెంకటరమణ, నిమ్మల రాఘవ, ఈది డైమండ్, కోడెటి సాయితరుణ్, లంకా సురేష్, వంగపండు దుర్గాప్రసాద్, అడబాల సురేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెనుగొండ

గోదావరిలో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి లక్ష్మణ్ (22) తాపీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. మద్యానికి బానిసై పనులకు సరిగ్గా వెళ్లకపోవడంతో తన సోదరుడు గాంధీ మందలించడంతో గత నెల 30వ తేదీ రాత్రి ఇంటి నుంచి దొంగరావిపాలెం బ్రిడ్జి పైకి వచ్చి తాను చనిపోతున్నట్లు తన సోదరుడికి ఫోన్ చేసి చెప్పి గోదావరిలో దూకాడు. కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం సిద్ధాంతం వద్ద గోదావరిలో అతని మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



కాళ్ల : బొండాడచినపేట గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ఆయన నివాసం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి గాంధీ ఆశయాలను, త్యాగాలను వివరించారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ఆయన నివాసంలో జనసైనికులతో కలిసి గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రవిప్రకాష్, ఎఎస్‌పి అల్లూరి సుబ్బరాజు గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

పెనుమంట్ర : మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్‌లో మహాత్మ గాంధీ విగ్రహాలకు సర్పంచి మట్టా కుమారి ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి పూలమాల వేసి నివాళులర్పించారు. వరిశోధనా సంస్థలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ షేక్ మదీనా బాషా, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.పద్మజ, తహశీల్దార్ దండు అశోక్ వర్మ ఆధ్వర్యంలో గాంధీకి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భీమవరం : రుణ మంజూరు పత్రాలను అందిస్తున్న వేణుగోపాల్, సంగీతకుమారి

భీమవరం : మహాత్మ గాంధీజీ చేతులమీదుగా 104 ఏళ్ల క్రితం ముంబైలో ప్రారంభించిన యూనియన్ బ్యాంక్ దేశంలోనే అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా విరజల్లుతోందని పిడిడిఆర్‌డిఎ వేణుగోపాల్ అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో రీజనల్ హెడ్ పి.సంగీతకుమారి అధ్యక్షతన గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా వేణుగోపాల్ హాజరై మాట్లాడారు. భీమవరం పట్టణం పిఎస్ఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శానిటరీ పాడ్ మిషన్, దిస్పోసబుల్ మెషీన్లు అందించారు. ఝాన్సిలక్ష్మీభాయ్ బాలికల ఉన్నత పాఠశాలలో రూ. రెండు లక్షల ఖర్చుతో మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం విరాళాన్ని అందించారు. మహిళలు రూ.రెండు కోట్ల రుణాలను మంజూరు చేసిన పత్రాలను వేణుగోపాల్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ వెంకటేశ్వరరావు, దివాకర్, చీఫ్ మేనేజర్లు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రంలోని పంచాయతీ పాలకవర్గ సభ్యులు గాంధీభవన్ సెంటర్ ప్రాంతంలో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, వైస్ ఎంపిపి సుబ్బారావు, ఉప సర్పంచి నరసింహరావు పాల్గొన్నారు. శ్రీ వాసవి ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో, గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో గాంధీ విగ్రహలకు సంఘ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

కాళ్ల : మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన సేవలు చిరస్మరణీయమని కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. బొండాడ చినపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శ్రీ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోపల్లె, వేంపాడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహాన్ని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు ఆవిష్కరించారు. విద్యార్థులకు, పిల్లలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లిపట్ల భాస్కరరావు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోపల్లె, వేంపాడు శాఖల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు దూడే సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్‌వర్మ, స్థానికులు దొండపాటి రవిచంద్రన్ పాల్గొన్నారు. బొండాడపేట గ్రామ సచివాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. బొండాడ పేట పంచాయతీ కార్యదర్శి చెన్ను సుజాత, జక్కరం గ్రామ సర్పంచి కూచంపూడి పద్మావతి, గ్రామ కార్యదర్శి ఎస్పెం కె.జమల్, బొండాడపేట సర్పంచి గోళ్ల వెంకటసత్యనారాయణ, ఉప సర్పంచి గుడ్ల మధుసూదన్‌రావు, ఎంపిటిసి సభ్యులు గుత్తికొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ మేజర్ గ్రామపంచాయతీ వద్ద సర్పంచి నక్కా శ్యామలా సోని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్ దొర, జెడ్‌పిటిసి సభ్యులు పోడూరి గోవర్ధని రామయ్య, వార్డు సభ్యులు చిట్నీడి రాము, మండ ప్రసాద్, పులిగోరు రవికుమార్, బండారు నాయుడు, చేవూరి శ్రీదేవి, వేంద్ర మంగ, కనకదుర్గ, సిద్దిరెడ్డి స్వాతి హేమ, దొమ్మేటి దేవి, పిల్లి చాముండేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలోని పిప్పర గ్రంథాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాకర్ శ్యామ్, పంచాయతీ కార్యదర్శి జి.బాలకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

పాలకోడేరు : విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ డిఆర్.స్వర్ణలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూలు వైస్ ప్రిన్సిపల్ రిచి జాన్ కిడ్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాలకోడేరు తహశీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండల బాలకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ, పొట్టి శ్రీరాములు, అంబేద్కర్ విగ్రహాలకు శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సూర్య ప్రకాశరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆచంట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి దిగమర్తి సూర్యకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, తమ్మినీడి పృథ్వి కుమార్, సుబ్బారావు, దాసిరెడ్డి పుణ్యవతి, వెంకటలక్ష్మి, ఇఒపిఆర్‌డి బాబు పాల్గొన్నారు.

ఉండి :ఉండిలో వైసిపి గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి, ఎంపిపిల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, జిల్లా బిసి సంఘం అధ్యక్షులు సూరవరపు వెంకటాచార్యులు, నాయకులు రణస్థుల మహంకాళి, గుండాబత్తుల సుబ్బారావు, బడుగు బాలాజీ, కమతం బెనర్జీ, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీనివాస్, రాయి సతీష్, సిరికి ఎర్రయ్య పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని పోడూరు గ్రామపంచాయతీలో గాంధీ జయంతి సందర్భంగా పంచాయతీలో పనిచేసే పారిశుధ్య సిబ్బందికి సర్పంచి సెట్టిబత్తుల సువర్ణరాజు సన్మానం చేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవి, సూర్య ఫణీంద్ర పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : జనసేన నరసాపురం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిఎసి సభ్యులు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ ఛైర్మన్ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొల్లాటి గోపీకృష్ణ, గంటా కృష్ణ, నిప్పులేటి తారక రామారావు, ఆకుల వెంకటస్వామి, తోట అరుణ, తోట నాని, కొట్టు రామాంజనేయులు, బొమ్మిడి కృష్ణమూర్తి, రావూరి సురేష్, పోలిశెట్టి గణేశ్వరరావు పాల్గొన్నారు. మీరా స్మారక గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ముచ్చర్ల త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు పొన్నాడ రాము పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని తూర్పుపాలెంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయంలో గాంధీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, తూర్పుపాలెం సర్పంచి గుబ్బల ఉషారాణి, వీరబ్రహ్మం, పోడూరు సాయిబాబా పాల్గొన్నారు.

జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జైలులో ఉన్న నిందితులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో జీవించాలని, మార్పు చెందిన మనస్సుతో పరిపూర్ణమైన వ్యక్తిగా సమాజంలో జీవించాలని నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ అన్నారు. జైలులో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశాలకు లోనై ఎటువంటి నేరాలకు పాల్పడరాదని, డ్రగ్స్ గంజాయి వినియోగం కలిగి ఉండడం వంటి నేరాలకు పాల్పడి శిక్షార్హులైతే వారితో పాటు వారి కుటుంబ సభ్యుల జీవితాలు కూడా నాశనమవుతాయన్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేని వారు జైలు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం నిందితులు సత్ప్రవర్తన కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జైల్ పరిసరాలను, వంట గదిని, స్టోర్ రూంను జడ్జి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, సంస్థ సభ్యులు యర్రంశెట్టి దేవేంద్రఫణికర్, సీనియర్ న్యాయవాది నారిన శ్రీనివాసరావు, ఉచిత న్యాయవాదులు నక్కా ఆనందబాబు, కె.శిరీష, సంస్థ సంఘ సేవకులు వై.సతీష్‌కుమార్, టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బిఎస్‌డిఆర్.ప్రసాద్, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు, పారా లీగల్ వాలంటీర్స్ రాంబాబు, వరలక్ష్మి, కోర్టు సిబ్బంది, జైల్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : స్థానిక ప్రత్యేక ఉప కారాగారంలో జైల్ పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి పాల్గొన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సురేష్‌బాబు, డిఎస్‌పి బి.శ్రీనాథ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.రమణరావు, మాజీ అధ్యక్షులు వై.న్యూటన్ పాల్గొన్నారు.

ఎఎస్‌పి పెద్దిరాజుకు సత్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు


ఎఎస్‌పిని సత్కరిస్తున్న వక్తలు

శృంగవృక్షం పంచాయతీ పరిధిలో బంటుమిల్లిలో బంటుమిల్లి విద్యా ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ట్రస్ట్ అధ్యక్షులు వీరవల్లి నరసింహారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రానున్న కాలంలో విద్యావ్యవస్థల్లో వచ్చే మార్పుల గురించి విద్యార్థులకు అందించాల్సిన సేవల గురించి చర్చించారు. విద్యా ట్రస్ట్ అధ్యక్షులు నరసింహారావు మాట్లాడుతూ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపిఎస్ స్థాయి అధికారిగా అంచెలంచెలుగా ఎదగడం చాలా అరుదన్నారు. ఎఎస్‌పి పెద్దిరాజు విషయంలో ఇది నిజమైందన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు పంపన సాయిబాబు మాట్లాడుతూ ఒక ఐపిఎస్ స్థాయి అధికారి ఉండటం బంటుమిల్లి ప్రాంతానికి గర్వకారణమన్నారు. వీరవాసరం కళాపరిషత్ అధ్యక్షులు గుండా రామకృష్ణ మాట్లాడుతూ పెద్దిరాజు రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. అనంతరం ఎఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందిన బండి పెద్దిరాజును బంటుమిల్లి విద్యా ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడలి సాయిబాబు, నక్కెళ్ల శ్రీరామచంద్రమూర్తి, దొంగ భారతీ లక్ష్మికుమారి, వీరవల్లి దుర్గారావు, శ్రీరాములు, దూసనపూడి మాజీ సర్పంచి సవరం కాశీ విశ్వేశ్వరరావు, పంపన వెంకట సత్య శ్రీను పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి

ప్రజాశక్తి - భీమవరం

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు భీమవరం న్యాయ శాఖ, న్యాయవాదులు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్ని న్యాయస్థానాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. న్యాయ శాఖ సిబ్బంది, న్యాయవాదులు అందరూ కలిసి కోర్ట్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి మాట్లాడుతూ పని చేసే చోట మధ్య మధ్యలో ఇలాంటి స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జి.సురేష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రమణరావు, జనరల్ సెక్రటరీ రమేష్‌బాబు, పరిపాలనా అధికారి సీతారామరాజు, న్యాయశాఖ సిబ్బంది, సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉండి :పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరవచ్చని కలిసిపూడి గ్రామ సర్పంచి కేసబోయిన జానకీశ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. మండలంలోని కలిసిపూడిలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచి, ఎంపిటిసి సభ్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా దోమలు వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ప్రస్తుత కాలంలో డెంగీ వ్యాధి బారిన ఎక్కువ మంది పడుతున్నారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరచవచ్చని చెప్పారు.

పందుల బెడదను నివారించండి

ఉండి గ్రామసభలో ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో పందుల బెడదను నివారించాలని గ్రామస్తులు సోమవారం గ్రామసభలో పంచాయతీ పాలకవర్గానికి మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ మాట్లాడుతూ పందుల పెంపకందారులు రోడ్ల పైన పందులను వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికే పందుల పెంపకందారులను హెచ్చరించినట్లు తెలిపారు. వారికి నోటీసులు జారీ చేస్తామని, పందుల పెంపకందారులు స్పందించకపోతే వాటిని సుదూర ప్రాంతాలకు తరలించి వారం రోజుల్లోగా సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. గ్రామంలో వీధిలైట్ల సమస్య ఉందని, ఇప్పటికే గ్రామంలో సుమారు వంద బల్బులను మార్చామని, మరొక 150 కొత్త బల్బులను అమర్చి గ్రామ ప్రజలకు వీధిలైట్ల సౌకర్యాన్ని అందిస్తామని వారు తెలిపారు. డ్రెయినేజీ సమస్యపై కూడా గ్రామసభలో ఫిర్యాదులు వచ్చాయని, గ్రామంలో చాలాచోట్ల సీసీ డ్రెయినేజీలు నిర్మించాలని, కొన్నిచోట్ల డ్రెయినేజీలు నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు సహకారంతో త్వరలోనే మరికొన్ని సీసీ డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు సర్పంచి, ఉప సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి



యలమంచిలి : కూరగాయల విక్రయిస్తున్న రైతు

ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చని పెదపుల్లేరు ఎంపిటిసి సభ్యులు రాయి రాములమ్మ అన్నారు. మండలంలోని పెదపులేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయాల్లో పండించిన ఆకుకూరలను, కూరగాయలను తక్కువ ధరలకే విక్రయించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సభ్యులు రాయి రాములమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఎటువంటి కృత్రిమ రసాయనిక ఎరువులు వాడటం జరగదని వారు సూచించారు. రసాయనాల వాడకం ఎక్కువగా ఉండటంవల్ల ప్రస్తుత పరిస్థితుల్లో అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల సత్యనారాయణ, రాయి శ్రీనివాస్, సిబ్బంది దుర్గ, అంగర శ్రీను పాల్గొన్నారు.

యలమంచిలి : ప్రకృతి సాగుతో పండించిన పంటలు ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని గుంపర్రు గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సాగు రైతు జడ్డు బదరీ నారాయణ అన్నారు. మండలంలోని కంబోట్లపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది ఏ విధమైన పురుగు మందుల అవశేషాలు లేకుండా సహజ సిద్ధంగా పండించిన కాయకూరలు స్టాల్ ద్వారా విక్రయించారు. ఈ సందర్భంగా రైతు బదరీ మాట్లాడుతూ ఈ కాయకూరలు కేవలం జీవామృతం, కసాయములుతో పండించినట్లు చెప్పారు. యూనిట్ ఇన్‌ఛార్జి జ్యోతి మాట్లాడుతూ గ్రామంలో రైతులు డ్వాక్రా మహిళలు తమ తమ పొలంలో గట్ల మీద, ఇంటి పెరటి తోట ఆవరణలో పకృతి వ్యవసాయ పద్ధతిలో కాయకూరలు పండించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బండి లక్ష్మీదుర్గ, శాంతి పాల్గొన్నారు.

భీమవరంలో భారీ అన్నసమారాధన

భీమవరం రూరల్ :అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహా గొప్పదని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొత్త బస్టాండ్ వద్ద ఉన్న వినాయక ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధనను ప్రారంభించి మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వాహకులు పెద్ద ఎత్తున వేలాది మందికి అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు.

CHANGE OF NAME

***I, PENMETSA MOHAN VARMA,* S/o. P.Suryanarayana Raju,** D.No. 28-1-123, Santhi Nagar, 2nd Line, Eluru, Eluru Disrict, A.P-534007. Have changed my name from **PENUMACHHA MOHAN VARMA (Old Name) To PENMETSA MOHAN VARMA (New Name)** Henceforth i am being called as **PENMETSA MOHAN VARMA** for all practical purposes.

మహారాజశ్రీ రామచంద్రపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 23/2020

బిట్వీన్:
కోనాల పురుషోత్తమరెడ్డి ...వాది
అండ్
జొన్నకూటి వెంకట్రావు, తండ్రి: వెంకన్న, ఆర్.టి.సి.డ్రైవర్, ఆర్.టి.సి.డిపో, జంగారెడ్డిగూడెం గ్రామం, మండలం, ప॥గో॥ జిల్లా (ప్రస్తుతం ఏలూరు జిల్లా) ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు వారి నుండి, పోస్టలు నుండి ఎన్నిసార్లు సమన్లు పంపించినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై నెంబరు దావా **దీ. 30-10-2023కి వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు పై కోర్టు వారి ఎదుట గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

రామచంద్రపురం, 29-9-23. **శిరిగినీడి హరికృష్ణ** అడ్వకేట్, రామచంద్రపురం.

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
O.S.NO: 1814 OF 2023

BETWEEN:
Smt. M. Kameswari ....Plaintiff
AND
N.S.Jagannadha Rao & 4 others ...Defendants

To, (Defendant No.4)
V.Nagavalli W/o V. Goapala Krishna D/o Late N.S.R.Murthy, Aged 69 years, Occupation : Retired Employee, R/o C/o Tambi, Vendra Agraharam, Vendra Post, West Godavari District, 534210, Andhra pradesh.

Take notice that the above named Plantiff filed above suit seeking relief of Partition & seperate possession and Perpetual Injuction against you & other Respondents/Defendants in respect of suit Schedule Property i.e.House Property bearing Muncipal No. 10-3-700 (165/RT), admeasuring 270.00 Square Yards, Situated at, Vijaya Nagar Colony, Mallepally, Hyderabad.

You are hereby summoned to appear in the above court in person or by a Pleader duly Instructed and able to answer all material questions relating to the suit or who shall, be accompanied by some person able to answer all such questions on the **13th day of October, 2023 at 10-30** in the forenoon before the above court, Take Notice that in default of your appearance the suit will be heard and determined in your absence according to law.

BY THE ORDER OF THE COURT

B.SHESHU KUMAR,
ADVOCATE
#3-3-991/1, Kutbiguda,
Hyderabad-500027.
Ph.No.9000011282
Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
I.A.NO. 596 OF 2023
IN
O.S.NO: 1814 OF 2023

Between:
Smt. M. Kameswari ... Petitioner/Plaintiff
AND
N.S.Jagannadha Rao & 4 others ...Respondents/Defendants

To, (Respondent No.4/Defendant No.4) V. Nagavalli W/o V Gopala Krishna D/o Leat N.S.R. Murthy, Aged 69 years, occupation : Retired Employee, R/o C/o Tambi, Vendra Agraharam, Vendra Post, West Godavari District, Pin -534210, Andhra Pradesh.

Take notice that the above named Plaintiff filed above suit seeking relief of partition & separate possession and Perpetual Injunction against you & other Respondents/ Defendants in respect of Suit schedule Property i.e. House Property bearing Municipal No. 10-3-700 (165/3RT) admeasuring 270.00 Square Yards, Situated at, Vijaya Nagar Colony, Mallepally, Hyderabad.

You are hereby summoned to appear in the above court in person or by a Pleader duly Instructed and able to answer all material questions relating to the suit or who shall, be accompanied by some person able to answer all such questions on the **13th day of October, 2023 at 10-30** in the forenoon before the above court, Take Notice that in default of your appearance the suit will be heard and determined in your absence according to law.

(BY THE ORDER OF THE COURT)

B. SHESHU KUMAR
ADVOCATE
#3-3-991/1, Kutbiguda,
Hyderabad-500027.
Ph.No. 9000011282
Counsel for the Plaintiff